# ప్రేమా... చెప్పవా నీ చిరునామా!

17 ఫిబ్రవరి 1986.

హోటల్ రెస్టారెంట్‌లో కార్నర్ సీట్‌లో కూర్చుని వున్నారు భగవతి, శ్రీరాజ్. ఆ హోటల్ అంతా ఖాళీగా వుంది. దాని పేరే 'హోటల్ రహస్య'.

"భగవతీ! ప్రేమకు పాదాభిషేకం అంటే ఏమిటి?" అన్నాడు శ్రీరాజ్ ఆమె ముఖాన్ని చేతుల్లోకి తీసుకునే ప్రయత్నం చేస్తూ.

"ఏమో నాకు తెలియదు" అంది భగవతి అతని చేతులను దూరంగా జరుపుతూ.

"చెప్తే నాకేమిస్తావ్!" అన్నాడు శ్రీరాజ్, ఆమె పెదవుల దగ్గరకి తన మొహాన్ని తీసుకువస్తూ.

"రెండు తంతాను" అంది భగవతి దూరంగా జరుగుతూ.

"సరేలే! తన్నడం తప్పితే నీకేమి చేతనవుతుందిలే. ప్రేమకు పాదాభిషేకం అంటే సతి పాదాల్ని పతి తన మెడచుట్టూ మెలిక వేసుకోవడం" అన్నాడు శ్రీరాజ్.

"అంటే" అంది అర్థం కానట్టు.

"పెళ్ళయ్యాక అర్థం అవుతుందిలే. అదీ మొదటి రాత్రి కాదు. ఆర్నెల్లు రొమాన్స్ అయ్యాక-"

"సార్! మీరు చేతులు తీస్తే ఐస్‌క్రీం అరేంజ్ చేస్తాను" అన్నాడు స్టీవర్డ్.

సిగ్గుతో తల దించుకుంది భగవతి.

టేబుల్‌పై ఐస్‌క్రీం అరేంజ్ చేసి స్టీవార్డ్ వెళ్ళిపోయాడు. అది తినేసి- యూనివర్సిటీ లవర్స్ కార్నర్‌లో కూర్చున్నారిద్దరూ. అరగంటసేపు ప్రపంచంలోని స్వీట్ నథింగ్స్ అన్నీ మాట్లాడేసుకున్నాక- అప్పుడే గుర్తొచ్చినట్టు-

"భగవతీ! ఈ రోజు నేనో వారపత్రికలో చూశాను. మెడమీద ఎడమవైపు పుట్టుమచ్చ వున్న అమ్మాయికి, ఆ స్థానంలో అధరాభిషేకం చేయిస్తే పుట్టబోయే పిల్లలు చాలా గొప్పవాళ్ళవుతారట" అన్నాడు శ్రీరాజ్.

"ఈజిట్! నాకుందేమో చూడు" అంది భగవతి ఉత్సాహంగా.

"నీకుందనే కదా, గుర్తుంచుకుని మరీ చెప్తున్నాను" సీరియస్‌గా అన్నాడు శ్రీరాజ్.

"ధరాభిషేకం అంటే?" అమాయకంగా ప్రశ్నించింది.

"ధరాభిషేకం కాదు, అధరాభిషేకం. అక్కడ తన ప్రియుణ్ణి ముద్దు పెట్టుకోనిస్తే..... భారత ప్రధాని కాగల రాజకీయవేత్తయినా, యండమూరి వీరేంద్రనాథ్‌లా పెద్ద రచయితన్నా, లేక బాలసుబ్రమణ్యంలా పెద్ద గాయకుడైనా అవుతాడట" అన్నాడు శ్రీరాజ్ అమాయకంగా మొహం పెట్టి.

"అమ్మో! ఆశ.... దోశ.... అప్పడం.... వడ.... లేటయ్యింది... పద వెళ్దాం" అంది భగవతి నవ్వు బిగపెట్టి.

"బోయ్ ఫ్రెండ్ కోరిక తీర్చని అమ్మాయిలు తరువాత జన్మలో కేవలం వాగ్దానాలు చేసే రాజకీయ నాయకులు అవుతారట" అన్నాడు కసిగా.

భగవతి నవ్వు బిగపట్టి "పెళ్ళి కాకుండానే బోయ్ ఫ్రెండ్స్ కోరికలు తీర్చే అమ్మాయిలు ఈ జన్మలోనే గైనకాలజిస్టులని ఆశ్రయిస్తారట, పద వెళ్దాం" అంది.

బైటికి రాగానే హీరో హోండా తీసి 'వెనక కూర్చో' అని చెప్పి స్టార్ట్ చేశాడు. రద్దీగా వున్న రోడ్‌మీద ట్రాఫిక్‌ను తప్పించుకుంటూ ట్యాంక్‌బండ్ మీదకు వెళ్ళింది హోండా.

"ఇంకా టైముంది, ఎటు వెళ్దాం" అని అడిగాడు.

సమాధానం రాలేదు. శ్రీరాజ్ వెనక్కు తిరిగి చూసేసరికి భగవతి లేదు. ఒక్కసారి గుండాగినట్టనిపించింది.

'భగవతి ఎక్కడైనా పడిపోయిందేమో!' అన్న భయం ఎక్కువైంది. బండిని ఓ పక్కగా ఆపాడు. కాళ్ళు, చేతులకు చెమటలు పట్టాయ్. ఏమి చెయ్యాలో అర్థం కాలేదు.

ఇంతలో బజాజ్ ఒకటి స్పీడుగా వచ్చి శ్రీరాజ్ పక్కన ఆగింది. వెనకనుండి భగవతి దిగి 'థాంక్స్' చెప్పగానే ఆ బండి మీద వున్నతను వెళ్ళిపోయాడు.

"శ్రీ! నేను కూర్చోకముందే అలా వెళ్ళిపోయావేంటి? చూడు పాపం, అతనెవరో నేను అడగ్గానే లిఫ్ట్ ఇచ్చాడు" అంది భగవతి అతన్ని చూసిన సంతోషంతో.

అయితే శ్రీరాజ్ ముఖంలో ఆ సంతోషం కనబడలేదు.

"నేను మళ్ళీ వెనక్కి వచ్చేవాణ్ణి కదా! ఆ బండి మీద ఎందుకు వచ్చావ్" అన్నాడు కోపంగా.

భగవతి "శ్రీ, నేనేం కావాలని వచ్చానా? నన్ను వదిలి నువ్వలా వెళ్ళిపోతే ఏం చెయ్యాలో తోచలేదు. నిన్ను సగం సాయంత్రంలో వదిలి వెళ్ళిపోతే ఇక రాత్రి నిద్ర పట్టదు. అందుకే అతన్ని లిఫ్ట్ అడిగాను" అంది అపాలజిటిక్‌గా.

"ప్రేమంటే ఏమిటో తెలుసా? నేను ప్రేమించిన అమ్మాయి ప్రతి క్షణం, ప్రతి అనుభూతి నాతోనే పంచుకోవాలని

వి. అనిత



●●

"ప్రేమకు పాదాభిషేకం" అంటే "సతి పాదాల్ని పతి తన మెడ చుట్టూ మెలిక వేసుకోవడం" అని చెప్పిన పతిదేవుడు నేర్పిన జీవిత పాఠం ●●

అనుకోవడం. మొన్న ఆదివారం నువ్వు మీ అన్నయ్యతో సినిమా కెళ్ళినప్పుడు కూడా నేనెంత బాధ పడ్డానో తెలుసా?" అన్నాడు శ్రీరాజ్.

గర్వంతో కూడిన చిరునవ్వు విరిసింది భగవతి పెదవులపై.

x x x

18 జనవరి 1987.

"మొదట నాకు పాపనిస్తావా, బాబునిస్తావా?" -శ్రీరాజ్.

"అప్పుడే అంత తొందరెందుకు" -భగవతి

"ఎందుకేమిటి? దేనికైనా ఫ్యూచర్ ప్లానింగ్ అవసరం. పాప పుడితే పదకొండేళ్ళకు పక్కింటబ్బాయితో లేచిపోవడం, బాబు పుడితే ఏడేళ్ళకే ఎదురింటమ్మాయికి కన్నుకొట్టడం నేర్పించొద్దూ" అన్నాడు శ్రీరాజ్.

కిలకిలా నవ్వింది భగవతి.

ఆ నవ్వులలో శ్రుతిలా... తుపాన్ వెళ్ళినంత వేగంగా రోజులు వెళ్ళిపోతున్నాయి. శ్రీరాజ్ కౌగిలిలో గువ్వలా ఒదిగిపోతుంటే కాలం ఎలా కరిగిపోతుందో తెలియడం లేదు.

x x x

25 మార్చి 1992.

సమయం తెల్లవారుఝాము అయిదయింది. అలారం మోగింది. బద్ధకంగా ఒళ్ళు విరుచుకుని లేచింది భగవతి.

శ్రీరాజ్ ఇంకా ఇంటికి రాలేదు. అంటే ఇంకా క్లబ్‌లో పేకాడుతూ.... తాగుతూ.... కూర్చున్నాడేమో... అనుకున్నప్పుడే....

కాలింగ్ బెల్ మోగింది.

తలుపు తీసేసరికి శ్రీరాజ్ తూలుతూ వచ్చి సోఫాలో పడిపోయాడు. అతన్ని తీసుకువెళ్ళి బెడ్రూమ్‌లో మంచంపై పడుకోబెడుతున్నప్పుడు ఓ కవర్ క్రింద పడింది.

ఆ కవర్ తీసి జేబులో పెడుతూ యధాలాపంగా కవర్‌వైపు చూసింది భగవతి. ఫ్రమ్ 'ప్రియా' అన్న అక్షరాలు కనిపించాయి.

ఏముందో అన్న క్యూరియాసిటీతో విప్పిచూసిన భగవతి కళ్ళు ఆశ్చర్యంతో




వెడల్పయ్యాయి.

"శ్రీరాజ్ మాజీ ప్రియురాలు ఆ ఊరికి వస్తున్నట్లు, శ్రీరాజ్‌ని స్టేషన్‌కు రమ్మన్నట్లు" మెసేజ్.

కంటిమీదికి ఉప్పెనలా దుఃఖం ముంచుకురాగా, అలా నిస్త్రాణగా కుర్చీలో కూలబడింది.

ఎంత తప్పచేసింది తను. తన తల్లిదండ్రులను ఎదిరించి 'ప్రేమ...దోమ....' అంటూ శ్రీరాజ్‌ను పెళ్ళి చేసుకున్నది దేనికోసం?

ప్రే....మా?

పెళ్లికి ముందు ఎంతో చలాకీగా వుండే శ్రీరాజ్‌లో లేని దుర్వ్యసనాలన్నీ పెళ్ళయి, ఇప్పుడు ఇద్దరు పిల్లలు పుట్టేసరికి పూర్తిగా బయటపడ్డాయి, లేదా కొత్తగా పుట్టుకొచ్చాయి.

'నా ప్రతిక్షణం నీ సమక్షంలోనే' అంటూ ఇరవై నాలుగ్గంటలూ సరిపోయేవి కాదు. నవ్వుతూ.... తుళ్ళుతూ.... ఎంతో ఆనందంగా.... మూడు షికార్లు.... ఆరు సినిమాలులా గడిచిపోయేటట్లు....

ప్రే...మ...గా...

ఇప్పుడు ఏదైనా అవసరం వుంటేనే మాట్లాడతాడు శ్రీరాజ్. అది కూడా అంటీ అంటనట్లుగా. ఆఫీస్ నుంచి అట్నుంచటే క్లబ్బులు... పేకాట... తాగుడూ....ఇక ఏ అర్ధరాత్రో ఇంటికి వచ్చి ఆ.... అవసరానికి మాత్రమే తన దగ్గరికి రావడం.... ఏదో పశువులా ప్రవర్తించి నిద్రపోవడం... ఎదిరిస్తే బలవంతంగా హింసించి తన పని సాగించుకోవడం....

"రాత్రి మీ జేబులోంచి పడింది" అంటూ లెటర్ ఇచ్చింది భగవతి.

భగవతి చేతిలో ఆ కవర్ చూడగానే చిన్నపిల్లలు తల్లికి తెలియకుండా వంట ఇంట్లోంచి దొంగలా చక్కెర తింటూ దొరికిపోయినట్లు భయపడ్డాడు. "నాలో నీవు గుర్తించని లోపం బహుశా ఇది చివరిది! క్షమించవా!" అన్నట్లు చూశాడు. భగవతి తలొంచుకుని లోపలికి వెళ్ళిపోయింది.

"నిజాయితీ గల తన స్వచ్ఛమైన ప్రేమకు అర్థమేమిటి?" అని భగవతి శ్రీరాజ్‌ని అడిగితే-

"ప్రేమా! అది ఈ ప్రపంచంలో లేనే లేదు. అంతా ట్రాష్! అవసరం కోసం, ఆనందం కోసం నటించడం" అంటాడు ప్రస్తుతం శ్రీరాజ్ నవ్వుతూ.

ఐదేళ్ళ క్రితం- "నువ్వు మీ అన్నయ్యతో సినిమాకి వెళ్ళినా నాకు ఈర్ష్యగా వుంటుంది" అన్న శ్రీరాజ్- ఐదేళ్ళ కిందట చెప్పిన నిర్వచనానికి, ఇప్పుడు చెప్పిన అర్థానికి గల తేడాను తల్చుకుంటే రగిలిపోయిన భగవతి హృదయం ప్రమిదలోంచి ఓ కన్నీటి చుక్క కాలిన నూనెలా చెక్కిలి మీదకు ఒదార్పు తున్నట్లుగా జారుతుంది.

'ప్రతి ప్రేమ వెనుక ఏదో ఒక స్వార్థం వుంటుంది. మనిషి ఎంత ప్రేమించినా తన స్వార్థానికే ఎక్కువ ప్రాముఖ్యత నిస్తాడు. దాని తర్వాతే ప్రేమైనా.....ఏదైనా' అనుకుంటూ- 'తన భర్త ఏ రోజైనా మారకపోతాడా, తనని తిరిగి ప్రేమించకపోతాడా' అని- సగటు భారత స్త్రీలా ప్రతి సాయంత్రం ఎదురుచూస్తోంది. ■